సాక్షి చిత్తూరు

బుధవారం । 17 । జనవరి । 2024



శాస్త్రోక్తంగా కనుమ

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కనుమ పండుగను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



ఆలయం..'స్వచ్ఛతీర్థ'ం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో సోమ,మంగళవారాల్లో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించారు. - 8లో



కుర్రకారు 'జోష్'

కోడెగిత్తల జోరు...కుర్రకారు హుషారు.. కనుమ జోష్ నింపింది. వెదురుకుప్పం మండలం నచ్చు కూరులో ఎడ్ల పందేలు జరిగాయి. - 8లో

న్యూస్‌రీల్

సంక్రాంతి.. సంప్రదాయాలకు నెలవు

- మంత్రి ఆర్కేరోజా



గోపూజలు చేస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : సంక్రాంతి పండుగ సంప్రదాయాలకు నెలవని, కనుమ పండుగ ప్రజలకు కమ్మనైన అనుభూతులను నింపాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకున్నారు. కనుమ రోజున గోమాతకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రంగు ముగ్గులు, బంధువులందరితో చేరి సంబరాలు చేసుకోవడం అన్నారు. అన్నదాతకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ సంక్రాంతి అయితే, రైతుతో పాటు వ్యవసాయ పనుల్లో పాల్గొనే గోమాతకు ప్రాధాన్యత ఇవ్వడానికి కనుమ పండుగను చేసుకుంటామన్నారు. గోమాత సకల దేవతలకు నిలయమన్నారు. గోమాతను పూజిస్తే దేవతలందరినీ పూజించినట్లే అన్నారు.

నేడు బంగారుపాళెంలో జాబ్‌మేళా

బంగారుపాళెం: మండల కేంద్రంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి గుణశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందన్నారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరై స్వయం ఉపాధి అవకాశాలను పొందాలని కోరారు. నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

19 నుంచి ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చిత్తూరు డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయా కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రిన్సిపాళ్లకు సూచనలిచ్చామని చెప్పారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.



చేజిక్కించుకున్న పలకతో స్థానికులు



పశువులను పట్టేందుకు యత్నిస్తున్న యువకులు



జల్లికట్టు చూసేందుకు హాజరైన జనం

రంకెలేసిన పౌరుషం

ఘనంగా ఎడ్ల పందేలు

- దూసుకొచ్చిన కోడెగిత్తలు
- నిలువరించిన యువత
- జనసంద్రంగా మారిన ఏ.రంగంపేట
- పరుష పందేలను తిలకించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- పలకలు దక్కించుకుని పండగ చేసుకున్న యువకులు

చంద్రగిరి: రంకెలేస్తూ దూసుకొచ్చే పోట్ల గిత్తలు.. కాలు దువ్వుతో పలకలు పట్టేందుకు సిద్ధమైన యువకులు.. మదపుటెద్దులను లొంగదీసుకుని కేరింతలు.. కొమ్ములకు కట్టిన పలకలు దక్కించుకుని సంబరాలు.. వీటన్నిటినీ వీక్షించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన జనాలు.. ఇదీ చంద్రగిరి మండలం, ఎం.రంగంపేటలో మంగళవారం కనిపించిన దృశ్యాలు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడో రోజైన పశువుల(కనుమ) పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. యజమానులు పశువుల కొమ్ములకు రంగులు వేసి, నడుముకు నల్ల ధారాలు కట్టి చూడచక్కగా ముస్తాబు చేశారు. అనంతరం పశువుల కొమ్ములకు పలకలు కట్టి పందేలకు వదిలారు. దూసుకొస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. పోట్ల గిత్తలను లొంగదీసుకుని విజయగర్వంతో ఉర్రూతలూగారు. కొమ్ములకు కట్టిన పలకలను దక్కించుకుని సంబరాల్లో మునిగితేలారు. పరుష పందేలను చూడడానికి రాష్ట్ర నలుమూలల నుంచి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు బోస్ చంద్రారెడ్డి సుమారు 60 పట్టీలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చిత్రాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పనపాకం, పుల్లయ్యగారిపల్లెలో జరిగిన ఎడ్ల పందేలకూ జనం పోటెత్తారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొని పరుషపందేలను వీక్షించారు. అక్కడి నుంచి ఏ.రంగంపేటలో నిర్వహించిన ఎడ్ల పందేలకు విచ్చేసి యువకులను ఉత్సాహపరిచారు. అనంతరం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలావుండగా పశువులను నిలువరించే క్రమంలో కొందరు గాయపడ్డారు. వారిని హుటాహుటిన 108లో తిరుపతి రుయాకు తరలించారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి





చంద్రగిరి నియోజకవర్గం రంగంపేటలో జల్లికట్టు పోటీలో రంకెలేసి ఉరకలు వేస్తున్న పశువులు, మిద్దెలపై నుంచి ఎడ్ల పందేలు వీక్షిస్తున్న ప్రేక్షకులు



జల్లికట్టు పోటీల్లో ఉరకలు వేస్తున్న పశువులు





జల్లికట్టులో పశువులను పట్టేందుకు ప్రయత్నిస్తున్న యువకులు



నవరత్నాలు, నేతల చిత్రాల పలకలను చూపుతున్న నేతలు

భక్తి పారవశ్యం.. మకరజ్యోతి దర్శనం



సదుం: తిరు ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



తిరు ఆభరణాల అలంకారంలో అయ్యప్పస్వామి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మకరజ్యోతిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. జ్యోతి దివ్యదర్శనం కాగానే అయ్యప్ప నామ స్మరణలతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అంతకు ముందు స్థానిక సదుమమ్మ ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తిరు ఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆభరణాలను తీసుకుని, మంత్రి కేరళ వాయిద్యాలు, ప్రత్యేక గొడుగుల నడుమ ఊరేగింపుగా అయ్యప్ప సన్నిధానానికి చేరుకున్నారు. పడి మెట్ల మీదుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. తిరు ఆభరణాలు అలంకరించిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నంబూద్రి నారాయణన్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయానికి తూర్పు దిక్కున ఉన్న కొండల్లో సాయంత్రం 6.45 గంటలకు భక్తులకు స్వామివారి మకరజ్యోతి దర్శనం కలిగింది. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణమంతా కర్పూర జ్యోతులు వెలిగించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలతమ్మ, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కృష్ణమూర్తి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, జింకా చలపతి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కుప్పిగానిపల్లెకు చెందిన నేతలతో విజయానందరెడ్డి

గుడిపాల: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి ఆధ్వర్యంలో జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం పలువురు చేరారు. మండలంలోని కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్‌రాయల్ ఆధ్వర్యంలో కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన 17 మంది జనసేన నాయకులు పార్టీలో చేరారు. విజయానందరెడ్డి వారికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సుమన్, విక్రమ్, విజయకుమార్, మురహరి, పురందర్‌బాబు, శ్రీనివాసులు, చిత్ర, కిరణ్‌సాయి, యుగంధర్, డిల్లిప్రశాంత్, బన్ని, ప్రభు, సాగర్, పరుశురాం, ఉమాశంకర్, తరుణ్ మాధవ్, చైతన్యకుమార్ ఉన్నారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి అడిషనల్ సీసీఎల్‌ఏ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న నలుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ చేసిన జిల్లాల్లో వారికి ఏఆర్వో (అడిషనల్ రిటర్నింగ్ ఆఫీసర్)లుగా నియమించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి.మురళిని కర్నూలు జిల్లా కొసిగి తహసీల్దార్‌గా నియమించారు. కలెక్టరేట్‌లో ఏఓఎల్ఆర్‌గా పనిచేస్తున్న కె.పద్మజను కర్నూలు జిల్లా పత్తికొండ తహసీల్దార్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న రామాంజులు నాయక్‌ను కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లోని కేఆర్ఆర్‌సీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మోహనవల్లిని అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికి తహసీల్దార్‌గా నియమించారు. బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా మకరజ్యోతి

–పురవీధుల్లో ఊరేగిన అయ్యప్ప స్వామి



యాదమరిలో ఊరేగుతున్న అయ్యప్పస్వామి

యాదమరి: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం మకరజ్యోతి దర్శనం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుర వీధుల్లో వ్యాఘ్ర వాహనంపై ఊరేగించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం నెయ్యాభిషేకం, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి వ్యాఘ్రవాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ముక్కంటి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ సెంథిల్‌కుమార్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణమూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో శాస్త్రోక్తంగా కనుమ

–గోమాతకు పూజలు చేసిన ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కనుమ పండుగను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ గోశాలలో గోవులకు విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. అనంతరం గోవులకు పచ్చిగడ్డి, అరటిపండ్లు, బెల్లం, నానబెట్టిన బియ్యం తినిపించారు. తరువాత గోవులను ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు, మాడవీధుల్లో ఊరేగింపుగా తిప్పారు. భక్తులు గోవులకు హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఏఈఓలు హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మకరసంక్రాంతి

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో సోమవారం మకరసంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి అనుబంధ ఆలయమైన వరదరాజులస్వామి ఆలయం ఎదుట ఆవుపేడతో అలికి, రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. అనంతరం ఆలయాధికారులు, సిబ్బంది అందరు కలసి పొంగళ్లు పెట్టారు. రాత్రి ప్రధాన ఆలయం నుంచి సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమాలకు పుష్పరావు లా యువజన సంఘం వారు ఉభయకర్తలుగా వ్య వహరించారు. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఏఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాడవీధుల్లో గోవులను ఊరేగిస్తున్న అర్చకులు

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

మన సంస్కృతి.. మన పండుగలో భాగంగా మకర సంక్రాంతి రోజున స్వామివారి అనుబంధ ఆలయమైన ఈశ్వరాలయంలో ఉన్న సూర్యదేవునికి ప్ర త్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.



పొంగళ్లు పెడుతున్న ఆలయాధికారులు

ముస్తాబైన కొండచుట్టు మండపం

నగరి : పట్టణంలో ఏటా కనుమ పండుగకు మరుసటి రోజున గిరిప్రదక్షిణ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జిల్లాలో మరెక్కడ లేని విధంగా 21 దేవతల ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా కొండ చుట్టు మండపం వద్దకు చేరుతాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వాహకులు మండపానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. మండపం చుట్టూ క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొండచుట్టు ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని నగరి డీఎస్పీ రవికుమార్ తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. మద్యం సేవించి గొడవలకు దిగే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవన్నారు.



రంగులు వేసిన కొండచుట్టు మండపం

ఆలయం..'స్వచ్ఛతీర్థ'ం

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో ఆలయాధికారులు సోమ,మంగళవారాల్లో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతీర్థ కార్యక్రమంలో భాగంగా కాణిపాకం ప్రధాన ఆలయంతోపాటు పరిసరాలు, బస్టాండ్, మరుగుదొడ్లు తదితర ప్రాంతాల్లో ఆలయాధికారులు, సిబ్బంది పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కొదండపాణి, ఇన్‌స్పెక్టర్ గిరి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న ఆలయాధికారులు, సిబ్బంది

తుదిజాబితాకు పకడ్బందీ కసరత్తు

- 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటర్ల తుదిజాబితా ప్రచురణకు అధికారులు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. ఓటర్ల జాబితాకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఒకే డోర్ నంబర్‌పై, జీరోడోర్ నంబర్‌పై ఓట్లు ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న తప్పిదాలను సరిదిద్దుతున్నారు. గత ఏడాది అక్టోబర్ 27న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. తర్వాత వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరీలకు సంబంధించి 3,52,045 దరఖాస్తులు రాగా అందులో 3,13,724 లను ఆమోదించారు. 38,289 దరఖాస్తులను తిరస్కరించారు. 32 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది.

కొత్త ఓట్ల ఆమోదం

- జిల్లా వ్యాప్తంగా కొత్త ఓటుహక్కు కోసం ఫారం-6 దరఖాస్తులు 1,11,068 వచ్చాయి. అందులో 97,336 దరఖాస్తులను ఆమోదించగా 13,726 దరఖాస్తులను తిరస్కరించారు.
- ఓట్ల తొలగింపు కోసం ఫారం-7 దరఖాస్తులు 1,28,634 రాగా అందులో 1,09,152 దరఖాస్తులను ఆమోదించారు. 19,458 దరఖాస్తులను తిరస్కరించారు.
- ఫారం 8లో చిరునామా మార్పు, పేరు ఇతర మార్పుల కోసం 1,12,343 దరఖాస్తులు రాగా అందులో 1,07,236 ఆమోదించారు. 5,105 దరఖాస్తులను తిరస్కరించారు.



స్వీప్ యాక్టివిటీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు(ఫైల్)

ఓటు హక్కుపై యువతకు అవగాహన

జిల్లాలోని యువతకు ఓటుహక్కుపై స్వీప్ యాక్టివిటీ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్నారు. యువత కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంతో 21 వేల మందికి పైగా యువకులు ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్నారు. వికలాంగుల ఓట్లను మార్కింగ్ చేశారు. ఈ ఎన్నికల్లో 80 ఏళ్ల దాటిన వృద్ధులకు హోమ్ ఓటింగ్‌కు మొదటిసారి అనుమతి ఇవ్వనున్నారు. ఓటర్ల నమోదుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించేందుకు, కొత్త మార్గదర్శకాలను వివరించేందుకు కలెక్టరేట్‌లో ప్రతి వారం సమావేశం నిర్వహిస్తున్నారు.

పారదర్శక జాబితాకు కసరత్తు



పారదర్శకమైన ఓటర్ల జాబితాకు కసరత్తు నిర్వహిస్తున్నాం. తుది ఓటర్ల జాబితాకు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నాం. ముసాయిదా జాబితాలో లోపాలను ఆయా రాజకీయ పార్టీల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుంటున్నాం. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ కసరత్తు చేస్తున్నాం.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు.



కుర్రకారు 'జోష్'



కోడెగిత్తల జోరు...కుర్రకారు హుషారు...కనుమ సరికొత్త జోష్ నింపింది. పండుగ సంబరాల్లో జనం మునిగితేలారు. మంగళవారం పశువుల పండుగ సందర్భంగా నిర్వహించిన పరుష పందేలు నువ్వా..నేనా.. అన్నట్లు సాగాయి. పోట్ల గిత్తల కొమ్ములకు కట్టిన కానుకలను చేజిక్కించుకునేందుకు కుర్రాళ్లు ఉరకలేశారు. కొన్ని గిత్తల కొమ్ములను యువకులు వంచగా.. మరికొన్ని ఎవరినీ లెక్కచేయకుండా దూసుకెళ్లాయి. దూసుకుపోతున్న ఎద్లను కట్టడి చేసేందుకు యువత చూపిన ఉత్సాహం ఉరకలేసింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం మండలంలోని నచ్చుకూరు గ్రామంలో జరిగిన ఎద్ల పందేలు దుమ్మురేపాయి.

–వెదురుకుప్పం

నలుగురు వేటగాళ్ల అరెస్టు

మూడు నాటు తుపాకుల స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ

బంగారుపాళెం: వేటకు వెళ్లి నాటు తుపాకీతో యువకుడిని కాల్చిన సంఘటనలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మండలంలోని కేఎం కండ్రిగ(కంతలచెరువు) గ్రామంలో ఈ నెల 12వ తేదీన గ్రామానికి చెందిన నాగరాజ, వెంకటేష్, పాండియన్, శేఖర్ బృందంగా నాగాలాపురం తూర్పు అడవిలోకి వేటకోసం వెళ్లారు. అదే గ్రామానికి చెందిన బాబు కుమారుడు ఉమాపతి(22) వేటకు వెళ్లాడు. అడవి జంతువు అనుకుని ఉమాపతిని నాగరాజు నాటుతుపాకీతో కాల్చాడు. దీంతో ఉమాపతి మృతి చెందాడు. ఈ కేసులో నలుగురు వేటగాళ్లను నాగలాపురం వద్ద అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు. సీఐ నాగరాజరావు పాల్గొన్నారు.

మాజీ జమిందార్ సుబ్బరామరాజా మృతి



సుబ్బరామరాజా(ఫైల్)

బంగారుపాళెం: మాజీ జమిందార్ ముద్దు బంగారు సుబ్బరామరాజా మంగళవారం మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో ఆయన తన స్వగృహంలో తుది స్వాస విడిచారు. బంగారుపాళెం పంచాయతీకి 30 సంవత్సరాలు పాటు సర్పంచ్‌గా ఉంటూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారు. మొగిలి శివాలయం ధర్మకర్తగా సుబ్బరామరాజా సేవలు అందించారు. రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజాకు సుబ్బరామరాజా పెదనాన్న. ఆయన భౌతిక కాయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు సందర్శించి, నివాళులు అర్పించారు. బుధవారం అంతిమ సంస్కారాలను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



రామమూర్తి మృతదేహం

పుత్తూరు: స్థానిక బైపాస్ రోడ్డులోని రామకృష్ణ సామిల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పి.రామమూర్తి(68) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్ఐ బాలసుబ్రమణ్యం తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. పట్టణంలోని నందిమంగళం దళితవాడకు చెందిన పి.రామమూర్తి సోమవారం రాత్రి యథావిధిగా రామకృష్ణ సామిల్‌లో నైట్ వాచ్‌మెన్ డ్యూటీకి వచ్చాడు. మిల్లు యజమాని గిరినాయుడు మంగళవారం ఉదయం 8 గంటలకు మిల్లు వద్దకు వచ్చి చూడగా రామమూర్తి మృతి చెందినట్లు గుర్తించాడు. వెంటనే బంధువులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు భార్య మురగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరుపై 'కన్నడ' వరద

తిమింగలాలను వదలి..చిరుచేపలను వేటాడిన చందంగా బడా స్మగ్లర్లను వదిలి, చోటా మోటా విక్రయదారుల అరెస్టులతోనే సరి.. ఎస్పీ హెచ్చరిస్తున్నా.. నిద్రావస్థలో పోలీసు, ఎస్ఈబీ వ్యవస్థ. ఫలితం జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యం ప్రవాహం.. ఎన్నికల వేళ పెనుసవాళ్లు ఎదురయ్యే పరిస్థితి. చిత్తూరులో కర్ణాటక మద్యం విక్రయాలపై ప్రత్యేక కథనం.

- ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం
- చోటా మోటా వ్యక్తుల అరెస్టులతో సరి
- బడా స్మగ్లర్ల భరతం పట్టేవారేరి?
- సారా, గంజాయి అమ్మకాలపై నిఘా శూన్యం
- ఖాకీ, ఎస్ఈబీ అధికారుల చోద్యం

చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కిందిస్థాయిలో అమ్మకాలు చేపడుతున్న చోటా మోటా వ్యక్తుల అరెస్టులతో పోలీసులు సరిపెడుతున్నారు. కర్ణాటక నుంచి పెద్ద మొత్తంలో మద్యం తీసుకొస్తున్న వారి ఆట కట్టించడంలో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్ణాటక మద్యాన్ని నియంత్రించకపోతే ఎన్నికలవేళ పోలీసు శాఖకు పెను సవాళ్లు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.



చిత్తూరు వన్‌టౌన్‌లో పట్టుబడిన కర్ణాటక మద్యం (ఫైల్)

తెర వెనుక ఎవరున్నారు..?

రెండు నెలల కాలంలో చిత్తూరు వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లతోపాటు చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ), అర్బన్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 32 మంది కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి కొద్దిపాటి మొత్తంలో కర్ణాటక మద్యం పాకెట్లు, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేస్తున్న నిందితుల్లో చాలా మంది చోటామోటా వ్యక్తులుగా తెలుస్తోంది. వీరికి పెద్ద మొత్తంలో మద్యం సరఫరా చేస్తున్న బడా స్మగ్లర్లను ఉద్దేశపూర్వకంగా ఖాకీలు తప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ కేసులో నిందితుడిని అరెస్టు చేసినప్పుడు అతనికి మద్యం ఎవరిచ్చారు? ఎంత మొత్తం ఇచ్చారు? దీనికి స్టాక్ పాయింట్ ఎక్కడ ఉంది? దీని వెనుక ఎవరున్నారు? ఎందరు పని చేస్తున్నారు? అసలు సరిహద్దులు దాటి మద్యం చిత్తూరులోకి ఎలా వస్తోంది? అనే కనీస దర్యాప్తును కూడా అధికారులు చేయడం లేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.


ఎస్పీ హెచ్చరిస్తున్నా..

కర్ణాటక మద్యం, సారా, గంజాయి విక్రయాలపై ప్రతినెలా జరిగే క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. సమాజానికి అపాయకరమైన ఇలాంటి వ్యాపారాలు చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని ఏ ఒక్కరిని ఉపేక్షించొద్దని పదేపదే హెచ్చరిస్తున్నారు. ఒత్తిళ్లకు తలగకుండా కర్ణాటక మద్యం సరఫరాలో ఉన్న నిందితులను కటకటాల్లోకి నెట్టాలని చెబుతున్న కిందిస్థాయి అధికారులకు ఇది అర్థం కావడం లేదో.. ఉద్దేశపూర్వకంగా పెడచెవిన పెడుతున్నారో తెలియడం లేదు. కొన్ని స్టేషన్‌లో ప్రధాన నిందితులను కటకటా ల్లోకి నెడుతూ అక్రమార్కులకు నిద్ర లేకుండా చేస్తుంటే...మరికొన్ని స్టేషన్‌లో వచ్చామా..కేసు పెట్టమా వెళ్లామా అనే తీరున ఖాకీల పనితీరు ఉంది.

కాసులకు కక్కుర్తి పడుతున్నారా?

కర్ణాటక మద్యాన్ని అడ్డుకోవడంలో కొన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కానిస్టేబుల్ స్థాయిలో ఒకరిద్దరు ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో అధికారులు ఎవరైనా కాసులకు కక్కుర్తి పడి మాముళ్లు తీసుకుంటున్నారా? అనే విషయం ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఆరోపణలకు కారణాలు లేకపోలేదు. పోలీసులు కర్ణాటక మద్యం కేసుల్లో అరెస్టులు చూపుతున్న ప్రతిసారి చిన్న వ్యక్తులే కనిపిస్తున్నారు. వీరి వెనుక ఉన్న ముఠాపై దృష్టి పెట్టడం లేదు. చిత్తూరు నగరంలోని తోటపాళెం, సంతపేట, కైలాసపురం, ఎస్టేట్, భరత్ నగర్, శంకరయ్య గుంట, జానకారపల్లె, వెంగళరావు కాలనీ, ఇందిరా నగర్, సాంబయ్య కండ్రిగ, కట్టమంచి, డి వెంగన్నపల్లె, ప్రశాంత్‌నగర్, మంగసముద్రం, అనుపల్లె, గాంధీ రోడ్డు, గాంధీనగర్, భరత్‌నగర్, బండపల్లె, వన్నియర్ బ్లాక్, మార్కెట్ చౌక్, తేనెబండ, బోడికొండ, సత్యనారాయణపురం ప్రాంతాల్లో విచ్చలవిడిగా కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కన్నడ మద్యం విక్రయాల ద్వారా రోజుకు రూ.10 లక్షల వరకు లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కర్ణాటక మద్యంతోపాటు సారా సరఫరా కూడా ఊపందుకుంది. భరత్‌నగర్‌తోపాటు గుడిపాల మండలం రాసనపల్లె నుంచి పెద్ద ఎత్తున సారా దిగుమతి అవుతోంది. చిత్తూరు కేంద్రంగా కర్ణాటక మద్యం, సారా వ్యాపారాలు చేస్తున్నారు. మద్యానికి బానిసైన కొందరు యువత మద్యం విక్రయాల ముసుగులో గంజాయిని సైతం సేవిస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ఇంట్లో తల్లిదండ్రులు మందలించిన వినే పరిస్థితి కనిపించడం లేదు. గంజాయి మత్తులో రోడ్లపై బీభత్సంగా వాహనాలు నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

కింగ్ పిన్‌ల భరతం పడతాం



కర్ణాటక మద్యం, గంజాయి, సారా కేసుల్లో ఎప్పటికప్పుడు నిందితులను పట్టుకుంటూనే ఉన్నాం. అరెస్టు అయిన నిందితులకు ఎవరు మద్యం సరఫరా చేశారనే విషయంపై కూడా విచారణ కొనసాగుతోంది. ఇటీవల గుడిపాలలో పట్టుకుంది బడా వ్యక్తినే. చిత్తూరులో కూడా మద్యం సరఫరా చేసే బడా వ్యక్తులపై నిఘా పెట్టాం. త్వరలోనే వాళ్లను అరెస్టు చేస్తాం.

– శ్రీలక్ష్మి, ఏఎస్పీ,
స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, చిత్తూరు

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

రేణిగుంట: రేణిగుంట-కడప రైల్వే మార్గంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపారు. కోడూరు మార్గంలో రేణిగుంట మండలం, కరకంబాడి సమీపంలో రైలు పట్టాలపై 28ఏళ్ల యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని వద్దనున్న ఆధార్ కార్డులో రాజ్‌బీర్ కుమార్(28)గా ఉన్నట్లు గుర్తించారు. అయితే మృతుని బంధువుల వివరాలు తెలియకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్వీ వైద్యకళాశాలకు తరలించినట్లు ఆయన వివరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

పాకాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గుడార్లబండ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. సోమవారం అన్నమయ్యజిల్లా, నిమ్మనపల్లె మండలం, కొండసానివారిపల్లె గ్రామానికి చెందిన పీ.సురేష్(30) గుడార్లబండ గ్రామానికి సమీపంలోని అప్పరాజుకుంట కట్ట కింద చెట్టుకుని ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ కలహాలతోనే సురేష్ మృతిచెందినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ మొగిలీశ్వర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.